సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం : 30 : మే : 2023



భూపోరాటం మళ్లీ మొదలైంది

తెలంగాణలో భూ పోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. - 8లో



అభివృద్ధిని చూసి ఆదరించాలి

భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్‌లో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
42° / 28°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

నేటి నుంచి క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

భువనగిరి : క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు భువనగిరిలోని జీనియస్ హైస్కూల్‌లో మంగళవారం నుంచి సీబీఎస్ఈ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు జీనియస్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అందుకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం హైదరాబాద్ జోన్ పరిధిలో 6 పాఠశాలలను ఎంపిక చేసినట్లు వివరించారు. వివరాల కోసం అకడమిక్ ఇన్‌చార్జి జయేష్ సెల్ నంబర్ 9912435214ను సంప్రదించాలని కోరారు.

శివాలయంలో పూజలు



శివపార్వతులను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో నిత్య కైంకర్యాలతో పాటు మండపంలో నిత్య రుద్ర హవనం నిర్వహించారు. అనంతరం అభిషేకం, అర్చనలు గావించారు. ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణం, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో నిత్య పూజలు నిర్వహించారు.


దేశంలో రాచరిక పాలన



విజ్ఞాన కేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట :మోదీ సర్కార్ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ రాచరిక పాలన సాగిస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. సోమవారం రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెంలో నిర్మిస్తున్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా లౌకిక, సార్వభౌమత్వానికి విరుద్ధంగా క్రతువులు నిర్వహించి దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీశారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ నాయకులు కొండమడుగు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, వనం ఉపేందర్, కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, బల్గూరి అంజయ్య, సర్పంచ్ జెల్లెల లక్ష్మమ్మ, శానగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర సుమలత, బానాల రాంరెడ్డి, ఎర్ర రవిందర్, పొట్ల చెర్వు అచ్చాలు, కాటమయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లు బాధ్యతల స్వీకరణ



సోలిపురం భాస్కర్‌రెడ్డి, చౌటుప్పల్



కె.నర్సింహారెడ్డి, భూదాన్‌పోచంపల్లి

చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి : చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌గా సోలిపురం భాస్కర్‌రెడ్డి, భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కోమటిరెడ్డి నర్సింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చౌటుప్పల్ కమిషనర్‌గా పని చేస్తున్న కోమటిరెడ్డి నర్సింహారెడ్డి గతేడాది డిసెంబర్‌లో సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి భూదాన్‌పోచంపల్లి కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కాగా నర్సింహారెడ్డి పోచంపల్లికి బదిలీ కాగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భాస్కర్‌రెడ్డి చౌటుప్పల్‌కు రెగ్యులర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

భువనగిరి టౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లెప్రగతి సమావేశం ఏర్పాటు చేసిన నేపథ్యంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం రద్దు చేశారు. తిరిగి 31వ తేదీ ఉదయం 10.30కి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

గొర్రెల పథకంపై అనాసక్తి!

తొలి విడతలో అక్రమాలు..
యూనిట్ల పంపిణీ తరచూ వాయిదా

- వాటాధనం చెల్లింపునకు ముందుకురాని లబ్ధిదారులు
- రెండో విడతలో 15,390 యూనిట్లు
- జూన్ 9న పంపిణీ చేయాలని నిర్ణయం
- ఇప్పటి వరకు 1,500 మంది మాత్రమే డీడీలు అందజేత



సాక్షి,యాదాద్రి : జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 9వ తేదీన పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే గొల్లకురుమలు తమ వాటాధనం చెల్లించడానికి ఆసక్తి చూపడలేదు. తొలి విడతలో అక్రమాలు, యూనిట్ల పంపిణీ తరచూ వాయిదా పడుతుండడం, జూన్ 9న నియోజకవర్గానికి కేవలం ఆరు యూనిట్లు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడంతో డీడీలు కట్టడానికి ముందుకు రావడం లేదు.

రెండో విడత యూనిట్లు, వచ్చిన డీడీలు ఇలా..

రెండో విడతలో 15,390 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో పంపిణీ చేస్తారన్న సమాచారంతో చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లో సుమారు 1,300మంది, మిగతా మండలాల్లో 210 మంది గొల్లకుర్మలు డీడీలు చెల్లించారు. కానీ, ప్రభుత్వం గొర్రెల యూనిట్లను పంపిణీ చేయకపోవడంతో వారంతా నిరాశ చెందారు. అంతేకాకుండా తరచూ వాయిదా వేస్తుండడం, ఎప్పుడు ఇస్తారో కూడా స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు తమ వాటాధనం చెల్లించడానికి ముందుకు రావడంలేదు. కాగా ప్రభుత్వం రెండో విడతలో యూనిట్ ధర పెంచింది. యూనిట్ విలువ రూ.1,75,00 ఉండగా ప్రభుత్వం వాటా రూ.1,31,250, లబ్ధిదారు రూ.43,750 డీడీ రూపంలో చెల్లించాలి. ఈ వాటా ధనాన్ని ఈ లాబ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అంతా పారదర్శకంగా ఉండేందుకు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు, రవాణా, పంపిణీ ప్రక్రియను చేపడుతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెల కొనుగోలు

జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరంపురం, కృష్ణా, కర్ణాటకలోని బెల్గాం, మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గొర్రెలను కొనుగోలు చేయనున్నారు. ఒక యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటుంది. 18 నెలల వయసుతో పాటు 20 కిలోల బరువు ఉండాలి.

వడ్డీకి తెచ్చి డీడీ తీశాను



గొర్రెల యూనిట్ కోసం ఏడు నెలల క్రితం బ్యాంకులో డీడీ తీశాను. ఇప్పటి వరకు యూనిట్ల జాడ లేదు. అధికారులెవ్వరిని అడిగినా అదిగో, ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అప్పు తెచ్చి డీడీ తీశాను. ఇప్పటికే రూ.7వేలు వడ్డీ చెల్లించాను. ప్రభుత్వానికి తీరిక ఉన్నప్పుడు గొర్రెలను పంపిణీ చేస్తానంటే వచ్చిన యూనిట్ అప్పులోళ్లకే సరిపోతుందేమో. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు వస్తుండడంతో గొర్రెల పంపిణీపై భరోసా కనిపించడం లేదు.

–ఒల్లూరి లింగస్వామి, మంధోళ్లగూడెం, చౌటుప్పల్ మండలం

స్పష్టత ఇస్తలేరు



రెండవ విడత గొర్రెల పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. దానికి సంబంధించిన జాబితాను వెటర్నరీ అధికారులు మాకు పంపించారు. మా దగ్గర ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ కూడా తీసుకున్నారు. కానీ డీడీలు ఎప్పుడు కట్టాలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. తమ వాటాధనం ఎప్పుడు చెల్లించాలనే విషయం కూడా చెప్పడం లేదు. డీడీలు లేకుండా గొర్రెలు పంపిణీ చేస్తారని కొందరు చెబుతున్నారు.

–మోటె శేఖర్ మల్లాపురం, కురుమ సంఘం సభ్యుడు

నియోజకవర్గానికి ఆరు యూనిట్లు



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 9వ తేదీన నియోజకవర్గానికి ఆరు యూనిట్ల చొప్పున గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తాం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు వీటిని పంపిణీ చేయనున్నారు. అయితే ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో డీడీ రాలేదు. గ్రామాల్లో తమ శాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. యూనిట్ల పంపిణీ ప్రారంభం కాగానే లబ్ధిదారులు తమ వాటాధనం చెల్లించే అవకాశం ఉంది.

–డాక్టర్ వి.కృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే దారిద్ర్యం



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం వివక్ష
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామన్నపేట : బీజేపీ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో 30 శాతానికి పైగా ప్రజలు దారిద్ర్యంతో బాధపడుతున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రామన్నపేటలో రూ.8.50 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి స్వంత రాష్ట్రం గుజరాత్‌లో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని పేర్కొన్నారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తెలంగాణలోని ఏడు మండలాలు, పీలేరు పవర్ ప్రాజెక్టును ఏపీకి కట్టబెట్టి తన కక్ష తీర్చుకుందన్నారు. తెలంగాణకు మోదీ పైసా ఇవ్వకపోగా వచ్చినప్పుడల్లా విషం చిమ్ముతున్నారని విమర్శించారు. చీకట్లో మగ్గుతున్నాయన్నారు. వందేళ్లలో జరగాల్సిన అభివృద్ధిని తొమ్మిదేళ్లలోనే చేసి చూపించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కేసీఆర్ కంటే ఇంకా మెరుగైన పథకాలు అమలు చేస్తామనే మగాడు ఎవడైనా ఉన్నాడా అని ప్రతిపక్ష నాయకులను ఉద్దేశించి అన్నారు. జాతీయ గ్రామీణ అవార్డుల్లో 70 శాతం తెలంగాణకు దక్కుతుండడం ఇక్కడ జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనమన్నాదశాబ్ది ఉత్సవాలను ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు పగటికలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. చిరుమర్తి లింగయ్య అనునిత్యం అభివృద్ధి కోసం తాపత్రయ పడే నాయకుడని, తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

మళ్లీ మాదే అధికారం : బడుగుల, చిరుమర్తి

బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేస్తుందని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ప్రజల ఆశీస్సులతో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ సీట్లు గెలుచుకుంటామని, రాష్ట్రంలో మూడవ సారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే ఇప్పర్తి రోడ్డు, చిట్యాల–భువనగిరి రోడ్డు, అమ్మనబోలు రోడ్ల అభివృద్ధి, మరమ్మతులతో పాటు రామన్నపేటలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎస్ఈ నర్సింహానాయక్, ఈఈ శంకరయ్య, డీఈ షహనాజ్, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ బొక్క మాధవరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ గొరిగె నర్సింహ, ఐబీఈఈ బి.సురేందర్‌రావ్, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గుత్తా నర్సింహారెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, పోచబోయిన మల్లేశం వివిధ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చాల్సిందే..





ధర్నా చేస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు, మాట్లాడుతున్న గూడూరు నారాయణరెడ్డి

- కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితుల ధర్నా
- మద్దతు తెలిపిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు
- బీఆర్ఎస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసితులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ, బీఆర్ఎస్, రైతు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రింగ్ రోడ్డు వల్ల భువనగిరి నియోజకవర్గ పరిధిలో వందలాది మంది రైతులు తమకు జీవనాధారమైన భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందే తప్పా.. రోడ్డు ఎక్కడి నుంచే వేయాలనేది రాష్ట్రం చేతిలోనే ఉంటుందని, ఇది రైతులు గుర్తించాలన్నారు. సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత, స్థానిక ఎమ్మెల్యే కోసం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని ఆరోపించారు. దీంతో భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు జోక్యం చేసుకొని అలా మాట్లాడవద్దన్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటల యుద్ధం పెరిగింది. అలైన్‌మెంట్ మార్పునకు స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో ప్రధానమంత్రికి లేఖ రాయిస్తారా అని ప్రశ్నించారు. ఆ విధంగా చేస్తే ప్రధానమంత్రితో నేను మాట్లాడి అలైన్‌మెంట్ మార్పు చేయిస్తానని గూడూరు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో రైతులకు కానుకగా రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారుస్తూ ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ మాట్లాడుతూ.. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ అలైన్‌మెంట్ మార్చాలని అవసరమైతే తమ పదవులకు రాజీనామా చేస్తామని, అధికార పార్టీ వారు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగెళ్లపల్లి రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎండీ అవతార్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, కౌన్సిలర్ నాయిని పూర్ణచందర్, కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు బీస్కుంట్ల సత్యనారాయణ, రఘుబాబు, మజహర్‌తో పాటు రాయగిరి తుక్కాపురం గ్రామాలు, వలిగొండ మండల రైతులు పాల్గొన్నారు.

నేడూ కొనసాగనున్న దీక్ష

కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితులు చేపట్టిన దీక్ష మంగళవారం కూడా కొనసాగనుంది.

అద్దె భవనాలు.. అవస్థలు!

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇరుకు గదుల్లో నిర్వహణ
- సౌకర్యాలు లేక లబ్ధిదారుల పాట్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత



ఆలేరులో ఇరుకు గదిలో నిర్వహిస్తున్న 7వ అంగన్‌వాడీ కేంద్రం

ఆలేరురూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక కునారిల్లుతున్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలతోపాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సగానికి పైగా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె ఇళ్లు, శిథిల భవనాలు, ఇరుకు గదుల్లో కొనసాగుతుండటంతో తమ చిన్నారులను కేంద్రాలకు పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు.

అంతటా సమస్యలే..

జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 241 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా 242 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతావి దాతలు సమకూర్చిన భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో ఏ ఒక్క చోట సరైన వసతులు లేవు. 354 కేంద్రాల్లో టాయిలెట్ల సౌకర్యం లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారు. 379 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. మరికొన్ని చోట్ల ఫ్యాన్లు లేకపోవడంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. 111 అంగన్‌వాడీల్లో తాగు నీటి సమస్య నెలకొంది.

సిబ్బంది కొరత

మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. 30 అంగన్‌వాడీ టీచర్లు, 41 మినీ అంగన్‌వాడీ టీచర్లు, 18 ఆయాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లు లేని చోట ఆయాలు, ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లే అన్ని పనులు చేయాల్సి వస్తోంది.

అనువైన భవనాలు దొరకడం లేదు



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దెకు అనువైన భవనాలు దొరకడం లేదు. దీంతో ఇరుకు గదుల్లో కేంద్రాలను నిర్వహించడానికి ఇబ్బందిపడాల్సి వస్తోంది. సకాలంలో అద్దె రాకపోవడంతో ఇంటి యజమానులకు చెప్పలేకపోతున్నాం. అన్ని కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి.

–ఫాతిమా, అంగన్‌వాడీ టీచర్, ఆలేరు

ఏడు నెలలుగా అద్దె బకాయి

అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడు నెలలుగా అద్దె బకాయిలు రావాల్సి ఉంది. దీంతో యజమానులు ఒత్తిడి తెస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ఏదో విధంగా వారికి సర్దిచెబుతూ నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ కేంద్రాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో 241 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా వాటిలో సరైన సౌకర్యాలు లేవు.మరోవైపు నెలనెలా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలి.

–కల్లూరి మల్లేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సౌకర్యాలు లేకపోతే మా దృష్టికి తేవాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు లేకపోతే నిర్వాహకులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి. అన్ని సౌకర్యాలున్న భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ఒకటి, రెండు చోట్ల ఏదైనా సమస్య ఉండవచ్చు. వాటిని కూడా పరిష్కరిస్తాం. అద్దె విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రుతి, వేదికపై జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

రామన్నపేట : వచ్చే ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రామన్నపేటలోని జేపీ గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న ప్రతీ సంక్షేమ పథకం, అభివృద్ధి పనుల్లో కేంద్ర నిధులు ఉన్నాయనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ మోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం నిర్వహించతలపెట్టిన ఐదు విభాగాల కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పార్టీ జెండాను ఎగురవేసి శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసం వెంకటేశ్వర్లు, గూడూరు నారాయణరెడ్డి, దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, నర్ల నర్సింగరావు, నకిరేకంటి మొగులయ్య, బందారపు లింగస్వామి, తాటిపాముల శివక్రిష్ణ, గర్దాసు సురేష్, కన్నెకంటి వెంకటేశ్వరాచారి, మదూరి ప్రభాకర్‌రావు, వనం అంజయ్య, కనుతాల అశోక్‌రెడ్డి, చంద్రయ్య, నకిరేకంటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని వీవీ పాఠశాల మైదానంలో ఈనెల 31నుంచి జూన్1 తేదీ వరకు రెండు రోజులపాటు నాలుగో తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రగ్బీ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి తరుణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మఠంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో తెలంగాణలోని 25 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. వీరి వెంట 50మంది కోచ్‌లు, మేనేజర్లు రానున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు తమకు ఏదైనా అసౌకర్యం కలిగితే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో పీఈటీ సతీష్, సీనియర్ రగ్బీ క్రీడాకారులు వినోద్‌నాయక్, సుమన్‌నాయక్, రజిత పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో ఉత్సవాలు

- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయినుంచి మొదులకొని జిల్లా స్థాయి వరకు చేపట్టే కార్యక్రమాల్లో రైతులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని కోరారు. తొమ్మిదేళ్ల కాలంలో తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయాలన్నారు. శాఖలవారీగా పురోగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

భువనగిరిటౌన్ : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బాలికలు వృత్తి నైపుణ్యం, మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా జిల్లాలోని 15 ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు, బీబీనగర్ మండలం రాఘవాపురం, భువనగిరిలోని 23వ వార్డు మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. బాలికలు వృత్తి శిక్షణ తరగతుల ద్వారా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు.మహిళలు ప్రతి అవసరానికి కుటుంబంపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎస్సీ సంక్షేమాధికారి జైపాల్‌రెడ్డి, జిల్లా విద్యా అధికారి ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీటీసీ వినూత్న నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పడుకొని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ

బొమ్మలరామారం: మండలంలోని హాజీపూర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ పక్కీరు రాజేందర్‌రెడ్డి సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో వినూత్నంగా నిరసన తెలిపారు. మండల కేంద్రం నుంచి హాజీపూర్ గ్రామానికి గల బీటీ రోడ్డు అధ్వాన్నంగా మారి మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. గ్రామం నుంచి మైలారంమీది తండా వరకు గల మెటల్ రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారిందన్నారు. అదేవిధంగా గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం గుమ్మం ఎదుట ప్లకార్డుతో పడుకొని నిరసన తెలిపారు. రాత్రి వరకు ఆయన అక్కడే ఉన్నారు. ఆలేరు ఎమ్మెల్యే ద్వారా స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసన కొనసాగుతుందన్నారు.

కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు

గుండాల: కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం భువనగిరి కోర్టు తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మురారిపల్లి గ్రామానికి చెందిన మాధవికి గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డితో 2011వ సంవత్సరంలో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు జన్మించిన తర్వాత మాధవికి అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. కాగా, మామ అండెం సత్తిరెడ్డి వ్యవసాయ పనులకు వెళ్లాలని నిత్యం కోడలిని వేధిస్తున్నాడు. మామ పోరు భరించలేని మాధవి 2017 జూలై 25న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిరోజులకు మాధవి మృతిచెందింది. మృతురాలి తల్లి అనుముల రాధ ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కరరావు నిందితుడిని ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని గుండాల పోలీసులు తెలిపారు.

అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్!

- మానసిక స్థితి సరిగా లేదంటూ ధ్రువీకరణ పత్రాలు జారీ
- అధికారులను మచ్చిక చేసుకుని మధ్యవర్తుల దందా
- ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.40వేలు డిమాండ్
- జెర్రిపోతులగూడెంలో 20మంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఆరోపణలు

చిలుకూరు : ప్రతి నెలా ప్రభుత్వ పింఛన్ పొందేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు మధ్యవర్తులు జిల్లా కేంద్రంలోని అధికారులను మచ్చిక చేసుకుని అనర్హులకు దివ్యాంగుల (మానసిక స్థితి సరిగా లేదని) ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించే దందాకు తెరలేపినట్లు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.30నుంచి 40వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే, జీవితకాల పింఛన్ పొందే అవకాశం ఉండడంతో ధ్రువీకరణ పత్రం కోసం అనర్హులు డబ్బుకు వెనుకాడడం లేదని సమాచారం.



జెర్రిపోతులగూడెం పంచాయతీ కార్యాలయం

మధ్యవర్తులుగా అధికార పార్టీ నాయకులు

చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీకి చెందిన నాయకులు కొంతకాలంగా సదరమ్ సర్టిఫికెట్లు ఇప్పించే దందా సాగిస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో ఆర్థికస్థోమత కలిగి ఉన్న వారిని గుర్తించి సదరమ్ సర్టిఫికెట్‌తో కలిగే ప్రయోజనాలు వివరించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా గ్రామంలో సుమారు 20మందికి మానసిక స్థితి సరిగా లేదని ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో ఇప్పుడు వారంతా పింఛన్ పొందుతున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

ముందే డబ్బులు తీసుకుని..

కాగా, సదరమ్ సర్టిఫికెట్ కోసం మధ్యవర్తులు ముందుగా అనర్హుల నుంచి డబ్బులు తీసుకుంటారు. ఆ తర్వాత ఎవరైతే డబ్బులు ఇచ్చారో వారికి మెంటల్ (మానసిక స్థితి సరిగా లేదని) అని ముందుగా తమకు అనుకూలంగా ఉండే బేతవోలు మీ సేవ కేంద్రాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రకటించిన తేదీల్లో సదరమ్ క్యాంప్‌లో బుకింగ్ చేస్తారు. ఇందుకు తక్కువ సమయం ఉండడంతో మీ సేవ కేంద్రం నిర్వాహకులు బుకింగ్ సమయంలో సాధారణంగా వచ్చే వారిని పక్కన పెట్టి అనర్హులకు బుకింగ్ చేస్తారు. ఆ తర్వాత అనుకున్న ప్రకారం జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులకు డబ్బులు ఇచ్చి పింఛన్ పొందేందుకు కావాల్సిన దివ్యాంగుల శాతాన్ని వేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని తెలిసింది. ఇలా ఒక్క జెర్రిపోతులగూడెంలోనే 20మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నారని సమాచారం. అంతేకాక దివ్యాంగుల పెన్షన్లలో సదరమ్ ధ్రువీకరణ పత్రాల్లో లోపం 30శాతం ఉంటే డబ్బులు తీసుకొని 70శాతం ఉన్నట్లుగా సర్టిఫికెట్లు ఇప్పించినట్లుగా తెలిసింది. దీంతో అన్ని అర్హతలు ఉన్నా తమకు మాత్రం పింఛన్లు రావడం లేదని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు గ్రామంలో దివ్యాంగుల ధ్రువీకరణపత్రాలపై విచారణ చేస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- రూ.24 లక్షల విలువ చేసే 120కిలోల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి : గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 120కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి భువనగిరి డీసీపీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని ఉస్మానాబాద్‌కు చెందిన రాజు షిండే, సంజయ్ చవాన్, శ్రవణ్ చున్నీలాల్ శర్మ, రాహుల్ షిండేలు ఇదే రాష్ట్రానికి చెందిన ముక్తార్ సూచన మేరకు గంజాయిని రవాణా చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల నలుగురు నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రకు బయలుదేరారు.

పోలీసులకు సమాచారం అందడంతో..

అయితే, గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులతో పాటు రామన్నపేట పోలీసులు ఈ నెల 28న రామన్నపేట పట్టణ కేంద్రంలో చిట్యాల-భువనగిరి రోడ్డు మార్గంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన కారును ఆపి అందులో ప్రయాణం చేస్తున్న నలుగురుని విచారించారు. దీంతో కారులో గంజాయి ఉన్నట్టుగా గుర్తించి వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సుమారు రూ. 24 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్ ఫోన్లు, కియా కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గంజాయి సరఫరా చేస్తూ ఇతరుల సూచన మేరకు అందజేస్తుంటారు. ఎవరి సూచన మేరకు వీరు గంజాయి సరఫరా చేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. గంజాయిని పట్టుకుని పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రామన్నపేట సీఐ మోతీరాం, ఎస్‌ఓటీ సీఐ నవీన్‌కుమార్ ఉన్నారు.



పట్టుబడిన నిందితులు, గంజాయి ప్యాకెట్లతో డీసీపీ రాజేష్‌చంద్ర, ఇతర పోలీస్ సిబ్బంది

కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం



శివసాయి (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయిగిరి-మోత్కూరు రోడ్డు పక్కన ఆత్మకూరు(ఎం) మండల పరిధిలో రాయిపల్లి స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. మృతదేహం పక్కన బైక్‌తో పాటు స్విచ్ఛాప్ అయిన సెల్‌ఫోన్ పడి ఉంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరూ చూడకపోవడంతో కుళ్లిపోయినట్లు తెలుస్తోంది. లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా, మృతదేహం ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి మొరిగాడి శివసాయి (21)గా పోలీసులు గుర్తించారు. ఫ్లవర్ డెకరేషన్ పనులు నిర్వహిస్తుంటాడు. శ్రీను తండ్రి మొరిగాడి మల్లేశం-తల్లి శారద కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శ్రీను నాయనమ్మ వద్దే ఉంటున్నాడు. ఈ నెల 22న ఫ్లవర్ డెకరేషన్ ఓనర్ వాసం ప్రసాద్‌కు చెందిన బైక్‌ను తీసుకుని బయటకు వెళుతున్నానని నానమ్మకు చెప్పి వెళ్లాడు. రాయిపల్లి రోడ్డు మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెంది ఉంటాడని బంధువులు పేర్కొంటున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు పానగాని శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డొమ్మేటి నాగరాజు తెలిపారు.

యాదాద్రి ఆలయంలో క్యూలైన్ల పరిశీలన

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధర్మదర్శనం, రూ.150 టికెట్ దర్శనం క్యూలైన్లను ఈఓ గీతారెడ్డి, డీఈఓ భాస్కర్, అధికారులు జైపాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌లతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ధర్మదర్శనం చేసుకునే భక్తులు కొండపైన బస్‌బే నుంచి క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించి మూడు అంతస్తుల పైకి చేరుకొని గోల్డ్ క్యూలైన్ నుంచి తూర్పురాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశిస్తారు. ఇక రూ.150 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు అష్టభుజి ప్రాకార మండపంలో నుంచి తూర్పురాజగోపురం ద్వారా దర్శనానికి వెళ్తారు. కానీ ఇప్పుడు క్యూకాంప్లెక్స్ నుంచే భక్తులను వేర్వేరుగా పంపనున్నారు. ఇందుకు సంబంధించి తూర్పురాజగోపురం ముందు ఉన్న పసిడి వర్ణం క్యూలైన్లలో భక్తులను పంపేందుకు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రూ.150 టికెట్ విక్రయాన్ని క్యూకాంప్లెక్స్‌లోనే ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా క్యూకాంప్లెక్స్ మూడో అంతస్తు నుంచి ప్రసాద విక్రయశాలకు వెళ్లే ద్వారాన్ని ఈఓ ఆదేశాలతో అధికారులు మూసివేశారు. గతంలో ఈ ద్వారం గుండా వృద్ధులు, దివ్యాంగులైన భక్తులు నేరుగా అష్టభుజి ప్రాకార మండపం వద్ద విక్రయించే రూ.150 టికెట్ కౌంటర్ వద్దకు వెళ్లి టికెట్ కొనుగోలు చేసి వెళ్లేవారు. కానీ ఇప్పుడు రూ.150 టికెట్ కొనుగోలు చేసే భక్తులు క్యూకాంప్లెక్స్‌లో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి



గణేష్ (ఫైల్)

తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వెంకటాపురంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన గుంటి నాగరాజు, లావణ్య దంపతుల కుమారుడు గుంటి గణేష్(20) గొర్రెల కాపరి. రోజూ మాదిరిగానే గొర్రెలను మేపడానికి తమ వ్యవసాయ బావి సమీపంలోకి తోలుకెళ్లాడు.సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా తోక చెరువు సమీపంలోని ఓ చెట్టు కిందికి గణేష్ వెళ్లాడు. గణేష్ నిల్చున్న సమీపంలోనే పిడుగు పడగా దాని ప్రభావంతో అతడు మృతిచెందాడు. పరిసర ప్రాంతంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గణేష్ జీవించి ఉన్నాడేమోనని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు కూతురుతో పాటు కుమారుడు గణేష్ సంతానం. చేతికందిన ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అందుబాటులో లేని ఉన్నతాధికారులు

- నామమాత్రంగా 'ప్రజావాణి'

భువనగిరిటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నామమాత్రంగా జరిగింది. కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో అర్జీలు ఇచ్చేందుకు ఎంతో దూరం నుంచి వచ్చిన ప్రజలు నిరుత్సాహపడ్డారు. అక్కడ కేటాయించిన అధికారులు పి. రామారావు, రాంమూర్తి మొత్తం 21 అర్జీలు స్వీకరించారు. సూరేపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 50 రోజులు అవుతున్నా నేటి వరకు ధాన్యం కొనుగోలు చేయడం లేదని గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యంలో 90శాతం కేంద్రంలోనే ఉన్నాయని, ప్రస్తుతం దాదాపు 70 లారీల ధాన్యం ఇక్కడ ఉందని, ధాన్యం కొనుగోలు చేయకపోతే వర్షాకాలం సీజన్‌కు పెట్టుబడి అందక సాగు ఆలస్యమవుతుందని అధికారులకు వివరించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కలెక్టర్ లేదు: రాములమ్మ, హన్మాపురం

నా భర్త చంద్రయ్య కొన్నినెలల క్రితం చనిపోయాడు. ఆయన పేరు మీద ఉన్న ఇల్లు నా పేరు మీద ఫౌతి చేయాలని గ్రామ కార్యదర్శికి అర్జీ పెట్టుకున్నా మూడు నెలల నుంచి గ్రామ కార్యదర్శి ఇబ్బందులు పెడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు వస్తే మేడం లేదు. కానీ ఇక్కడే ఉన్న అధికారికి అర్జీ ఇచ్చిపోతున్నా.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్: ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడేనికి చెందిన బాదూరి వెంకటేశం (41) చేనేత వృత్తిపై జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 27న తన సెల్‌ఫోన్‌ను ఇంట్లో వదిలి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తమ్ముడు నాగభూషణ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ సీత పొందు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు

యాదగిరిగుట్ట రూరల్: వివాహితను వేధిస్తున్న యువకుడిపై సోమవారం యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గౌరాయపల్లికి చెందిన మంచు ఉదయ్ అదే గ్రామానికి చెందిన వివాహితను కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో సదరు మహిళ యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో నలుగురికి గాయాలు



బాబు (ఫైల్)

చౌటుప్పల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. చౌటుప్పల్, భువనగిరి, సంస్థాన్ నారాయణపురం మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామంలో నివాసం ఉండే గాడ్డుల బాబు(27) ఆదివారం ఉదయం సొంతూరైన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి వచ్చాడు. అదే రోజు రాత్రి బైక్‌పై తిరిగి కొత్తగూడేనికి బయలుదేరాడు. మార్గమధ్యలో దండుమల్కాపురం గ్రామ శివారులో ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, ఎలాంటి సిగ్నల్ లేకుండానే వాహనాన్ని హైవేపై నిలిపాడు. ఈ క్రమంలో బాబు బైక్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్సులో చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాబు చనిపోయినట్టుగా నిర్ధారించారు. మృతుడి తమ్ముడు సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని..



శ్రీధర్ (ఫైల్)

భువనగిరి : మండల పరిధిలోని కూనూరు గ్రామానికి చెందిన వడ్డి శ్రీధర్(23) పనినిమిత్తం ఇంటినుంచి బైక్‌పై రాయగిరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయగిరి గ్రామ సమీపంలో టిప్పర్ సైడు నుంచి శ్రీధర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీధర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే సమయంలో కూనూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి టీవీఎస్ వాహనంపై వెళ్తున్నాడు. ఇతని వాహనానికి మృతుడి వాహనం తగలడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.

నారాయణపురంలో..

సంస్థాన్ నారాయణపురం : నల్లగొండ జిల్లా బుద్ధారం గ్రామానికి చెందిన మోహన్, తన భార్య గీతాంజలి, కుమారులు హర్షవర్ధన్ (12), సతీష్‌తో కలసి స్కూటీపై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సంస్థాన్ నారాయణపురం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ వీరి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీపై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఈదురుగాలులు.. వడగండ్ల వర్షం



కోనాపూర్‌లో కూలిన విద్యుత్ స్తంభం

తుర్కపల్లి: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఇబ్రహీంపూర్, గంధమల్ల గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. మామిడి కాయలు నేలరాలాయి. గంధమల్ల, కోనాపూర్ గ్రామాల్లో నాలుగు 11 కేవీ విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ఏఈ భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంతో పాటు సంగ్యాతండా, వెంకటాపూర్, దత్తాయిపల్లి, ఇబ్రహీంపూర్, కోనాపూర్‌లో వడగండ్లు కురిసినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

తెలంగాణలో భూపోరాటం మళ్లీ మొదలైంది

- ప్రజాయుద్ధ నౌక గద్దర్
- రీజినల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితుల దీక్షకు సంఘీభావం



రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల దీక్షలో మాట్లాడుతున్న గద్దర్

సాక్షి, యాదాద్రి: భూపోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. భూమి సమస్య తెలంగాణ సమస్య అని మహాభారత కాలం, నిజాం కాలం నుంచి నేటి వరకు భూమి సమస్య ఉందన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భూనిర్వాసితులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ధరణి పేరుతో తెలంగాణలో పెద్ద కుట్ర జరిగిందని, పెట్టుబడి సాయంతో పంట భూములను బీడు భూములుగా మార్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌లు 25 లక్షల ఎకరాల భూములను మింగేశారన్నారు. కేటీఆర్ బంజారా భూములను గుంజుకుని అమెజాన్ సంస్థకు అమ్మేశారన్నారు. కార్పొరేట్ శక్తులకు భూములను ఇవ్వడంపై ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన భువనగిరి నుంచే మరో భూపోరాటం ప్రారంభం కావాలన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. భూములు తీసుకోవడం ప్రభుత్వం వెంటనే ఆపివేయలన్నారు. రీజినల్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజ్యాంగం ప్రకారం ఎకరం భూమికి.. మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులు వచ్చే ఎన్నికల్లో నామినేషన్లువేసి తమ సత్తాను చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు అనే ఆయుధంతో పోరాడి మరో విప్లవాన్ని తీసుకురావాలని గద్దర్ ప్రజలను కోరారు.

అభివృద్ధిని చూసి ఆదరించాలి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తానని, ఆ అభివృద్ధిని చూసి ప్రజలు తనను వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని 12వ వార్డు భావనారుషిపేట, లక్ష్మణ్‌నగర్ కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోచంపల్లి మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి కృషిచేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు దేవరాయ కుమార్, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, నాయకులు సీత శ్రవణ్, దోర్నాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి: అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి..

బీబీనగర్: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు సమీపంలో గల పలు వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీత, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ దస్తగిరి, బీఆర్ఎస్ నాయకులు వెంకటకిషన్, మహేష్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.